"స్వామీ. మా అమ్మగారు మిమ్మల్ని రమ్మంటున్నారు."

ఎందుకోనని ఆ ఇంట్లోకి వెళ్ళిన అతనికి అది వేశ్యా గృహం అని అర్థమైంది. ఆమె వినమ్రంగా నమస్కరించి చెప్పింది.

"నాకు విద్వాంసులంటే ఎనలేని ప్రీతి. దయతో ఈ ఒక్కపూట నా ఆతిథ్యం స్వీకరించి నేనిచ్చే దక్షిణ తీసుకుని రాత్రికి వెళ్ళదురు గాని."

అతను అట్టే సంకోచించలేదు. 'ఆమె చేతి వంట తింటున్న సంగతి తన ఊరివాళ్ళకి ఎన్నటికీ తెలీదు. పైగా దక్షిణ కూడా ముడుతుంది. అంతగా అయితే తర్వాత ప్రాయశ్చిత్త జపం చేసుకోవచ్చు' అనుకున్నాడు.

ఆమె వంట వండి అతని పాదాలు కడిగి వెండి కంచంలో అన్నం వడ్డించింది. అతను తినబోతూండగా ఆ పళ్ళెం లాక్కుంది. ఆశ్చర్యపోయిన అతనితో చెప్పింది.

"అయ్యా! మీరు కాశీలో నేర్చుకున్నది మీకు తిండి పెడుతుందేమో కాని, మోక్షాన్నివ్వదు. ఇతరులు తెచ్చే నీటినే తాకని సదాచారులైన మీరు వేశ్య వండిన భోజనం తినడానికి ఎందుకు సంసిద్ధులయ్యారో తెలుసా? నా వినమ్రతకి, నేనిచ్చే దక్షిణకి వ్యామోహం చెంది. నే చెప్పే పాఠం గుర్తుంచుకోండి. ప్రలోభ వ్యామోహాలే పాపానికి తల్లితండ్రులు. అవే మనల్ని మోక్షానికి దూరం చేసేవి. వాటిని దూరం చేయండి."

## 23. తగిన శిక్ష

ఓ అర్ధరాత్రి ధర్మ గంట మోగడంతో ఓ రాజుగారికి మెలకువ వచ్చింది. దాన్ని ఎవరు కొట్టారో చూసి రమ్మని రాజు తన సేవకుడ్ని పంపాడు. కొద్దిసేపట్లో సేవకులు ఓ కుక్కని, సంకెళ్ళు వేసి బలవంతంగా ఓ తాగుబోతుని వెంటపెట్టుకుని వచ్చారు.

"నేను రోడ్డు పక్కన పడుక్కుని వుంటే, ఈ తాగుబోతు తన దారిన తను వెళ్ళక నన్ను రాళ్ళతో కొట్టి మరీ వెళ్ళాడు." ఫిర్యాదు చేసింది కుక్క.

"నువ్వు ఈ కుక్కని రాళ్ళతో కొట్టావా?" గద్దిస్తూ అడిగాడు రాజు.

"నిజమే. సరదాకి దీని మీదకి రాళ్ళు విసిరాను." ఆ తాగుబోతు ఒప్పుకున్నాడు.

"ఇతనికి ఏం శిక్ష వేయమంటావు?" కుక్కని అడిగాడు రాజు.

"వీడిని ఓ మఠానికి అధిపతిగా చెయ్యడం వీడికి సరైన శిక్ష."

భటులు తాగుబోతుని తీసుకువెళ్ళాక రాజు కుక్కని ఆశ్చర్యంగా అడిగాడు.

"మఠాధిపతి అయితే ఐశ్వర్యం, సేవకులు, సమస్త సౌకర్యాలు వాడు అనుభవిస్తాడు కదా? అది శిక్ష ఎందుకు అవుతుంది?"

అందుకా కుక్క జవాబు చెప్పింది.

"మఠాధిపతిగా ఉన్నవాడు నియమ నిబంధనలని పాటించి ఆధ్యాత్మికంగా ఉన్నత గతి పొందేలా జీవించాలి. గృహస్తు తప్పు చేస్తే మళ్ళీ మనుష్య జన్మ రావచ్చు కాని, ధర్మాన్ని బోధించాల్సిన మఠాధిపతి భౌతిక సుఖాలకి ఆశపడి తప్పు చేస్తే మాత్రం తర్వాతి జన్మలో కుక్కగా పుట్టక తప్పదు. నేను గత జన్మలో అలాంటి మఠాధిపతినే."

## 24. దీవెనలు

"స్వామీ. దేవుడు మనిషి కోరుకునేవాటిలో కనీసం కొన్నయినా ఫలించేలా ఏర్పాటు చేస్తే ఎంతో బావుండేది."

"ఏం బావుండేది కాదు కాబట్టే ఆ ఏర్పాటు చేయలేదాయన. అదే జరిగి వుంటే, ఈ ప్రపంచంలో ఒక్కరూ బ్రతికివుండరు."

"అదేమిటి స్వామీ?"

"అవును. కష్టం వచ్చినప్పుడు ప్రతీ మనిషి 'నేను చస్తే బావుండును' అని కోరుకుంటాడు కదా? తక్షణం కోరిన కోరికల్లా తీరుతూంటే, ప్రతీ మనిషి